శనివారం
28 మార్చి 2026
సంపుటి: 02 సంచిక:365
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

## అయోధ్యలో అద్భుతం

శ్రీరామనవమి రోజు బాలరాముడి నుదిటిపై సూర్యతిలకం



2 లో

# రాష్ట్రాల సన్నద్ధతపై సమీక్ష



### సిఎంలతో ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్


న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు మినహా మిగిలిన వారితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. యుద్ధంతో ఇంధన సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో రాష్ట్రాల సన్నద్ధతపై, వారి ప్రణాళికలపై సమీక్ష జరిపారు. టీమ్ ఇండియా స్ఫూర్తితో ఈ కృషిలో సమన్వయం సాధించడమే ఈ వీడియో సమావేశం లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో పరిస్థితులను, అలాగే భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ముఖ్యమంత్రులకు ఈ సమావేశంలో ప్రధాని వివరించారని తెలుస్తోందిపశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని

వివరాలు2లో..

### మొక్కజొన్న ధరలో లోటు

# రైతులకు చెల్లిస్తాం

### -- అనుమతించాలని కేంద్రానికి సిఎం లేఖ



అమరావతి : రాష్ట్రంలో మొక్కజొన్న రైతులను ధరల పతనం నుంచి కాపాడేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ధరలో లోటును చెల్లించేందుకు కేంద్రం అనుమతిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలో మొక్కజొన్నకు కనీస మద్దతు ధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న పరిస్థితిలో రైతులకు వ్యత్యాసం మొత్తాన్ని చెల్లించే విధంగా ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ (పిడిపి) పథకం అమలు చేయాలని సూచించారు. ఈ పథకంలో 50:50 నిష్పత్తి బదులు 100 శాతం నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న 25 శాతం కవరేజీని 100 శాతానికి పెంచాలని, ఈ పథకాన్ని జూన్ 2026 వరకూ అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, 4.83 లక్షల హెక్టార్లలో సాగు చేయగా, సుమారు 37.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేసినట్లు వెల్లడించారు. నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు, విజయనగరం జిల్లాలు ప్రధాన ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయన్నారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న దిగుబడులు అధికంగా ఉండటం వల్ల మార్కెట్‌లో సరఫరా పెరిగిందని, దీంతో మార్కెట్‌లో ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ధరలు మరింత పడిపోవచ్చని అంచనా ఉందన్నారు. రైతులు తక్కువ ధరలకు మొక్కజొన్న పంటను విక్రయించకుండా ధరలను స్థిరీకరించడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతి లభిస్తే రైతులకు పెద్ద ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నేడు 16 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు


అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నాడు 16 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 68 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లా బూర్జ, విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, దత్తిరాజేరు, గుర్ల, మెరకముడిదాం, రాజాం, రేగడి ఆముదాలవలస, సంతకవిటి, తెర్లాం, వంగర మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి, పాలకొండ, సాలూరు, సీతానగరం మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ప్రఖర్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాల్లో 40 -- 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

వివరాలు2లో..



### అమరావతిపై మీ విధానమేంటి

# జే..టర్న్ జగన్?



### 2014-19 మధ్య చెప్పిన కబుర్లు

### ఇప్పుడు అసెంబ్లీకి వచ్చి చెప్పొచ్చుగా..మంత్రి లోకేశ్ ,

అమరావతి: 'అమరావతిపై మీ విధానమేంటి.. జే..టర్న్ జగన్?' అని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. 2014-19 మధ్య జగన్ అమరావతికి మద్దతుగా మాట్లాడటం.. తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులు ప్రకటించడం వరకు.. వివిధ సందర్భాల్లో వైకాపా అధ్యక్షుడు అమరావతిపై చేసిన వ్యాఖ్యల వీడియోల్ని లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. శనివారం అసెంబ్లీకొచ్చి ఇవే కబుర్లు చెప్పొచ్చు కదా అని జగన్‌ను ప్రశ్నించారఆయా వీడియోల్లో.. "ఇదే క్యాపిటల్ సిటీలో స్థలం కొనుక్కొని.. ఇల్లు కట్టుకొని ఇక్కడే ఉండబోతున్నా. తెదేపా ప్రభుత్వం పోయి వైకాపా ప్రభుత్వం వచ్చాక బ్రహ్మాండంగా అమరావతిని కడతాం. రైతులు ఆనందపడేలా నిర్మిస్తాం. కేంద్ర ప్రభుత్వం సహాయం చేసినా, చేయకపోయినా హైదరాబాద్‌ను మించిన మహానగరం కడతాం. ఎలా కడతామనేది మా బుర్రలోంచి వస్తుంది. ఏ రాజధాని అయినా రాష్ట్రం మధ్యలో ఉండాలి. ప్రజలు ప్రయాణానికి ఇబ్బంది పడకూడదు. భూమి, నీళ్లు ఉండాలి. కృష్ణ-గుంటూరు మధ్య రాజధాని ఉండాలి.కనీసం 30 వేల ఎకరాల్లో కట్టాలి. అమరావతి కట్టాలంటే నా వల్లే అవుతుంది. రాజధానిలో గార్డెన్ సిటీ తీసుకొస్తాం. రాజధాని చుట్టూ యూఫోరియా క్రియేట్ చేస్తాం. ఒక

వివరాలు2లో..

# ప్రధాని నిర్ణయం దేశ ప్రజలకు ఊరట

### డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్



అమరావతి :' ప్రధాని మోడీ పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించి ఇంధన భారం నుంచి ఊరట కల్పించడం దేశ ప్రజలకు ఊరటనిస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం ఇంధన సంక్షోభంలో చిక్కుకున్న వేళ మోడీ ఆ ప్రభావం దేశంపై పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలపై భారం పడకుండా తీసుకుంటున్న చర్యలు

వివరాలు2లో..

# జలచరాలకు ప్రమాద ఘంటిక ..!



### సముద్రంలో 600 కి.మీ మేర పేరుకుపోయిన చమురు తెట్టు

మెక్సికో : గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో 600 కి.మీ మేర భారీ స్థాయిలో చమురు తెట్టు ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. చమురు తెట్టు విస్తరించి సముద్ర జీవ వైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు

వివరాలు2లో..

### డాలర్ తో పోలిస్తే

# రూ. 94.82 వద్దకు చేరిక

### పెరగనున్న దిగుమతి వస్తువుల ధరలు



న్యూఢిల్లీ, మార్చి 27: రూపాయి విలువ పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో రూపాయి విలువ రూ. 0.86 పైసల మేర పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూ. 94.82 వద్దకు చేరుకుంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి రూపాయి సుమారు ఐదు శాతం మేర క్షీణించడం గమనార్హం. రూపాయి పతనానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి.ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయం మార్కెట్లను వెంటాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్ లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్ కు 110 డాలర్ల మార్కును దాటడం భారత్ లాంటి దిగుమతి దేశాల కరెన్సీపై ఒత్తిడి పెంచుతోంది. చమురు ధరలు పెరగడంతో భారత్ దిగుమతి వ్యయం భారీగా పెరిగి, కరెన్సీ నిల్వలపై ప్రభావం చూపుతోంభారత్ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకోవడం కూడా రూపాయి బలహీనపడటానికి కారణమైంది. రూపాయి విలువ పతనంతో విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరగనున్నాయి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ముడిచమురు, వంటనూనెల ధరలు పెరిగే అవకాశం ఉండటంతో ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుడిపై భారం పడే ప్రమాదం పొంచి ఉంది.

# దద్దరిల్లిన పశ్చిమాసియా

### హైఫా పోర్ట్‌పై ఇరాన్ క్షపణి దాడి

### బహ్రెయిన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై ధ్వంసం

### ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం: ఐడీఎఫ్ రక్షణ చీఫ్ కట్జ్



టెహ్రాన్/బీరుట్/జెరూసలెం, మార్చి 27: ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల శుక్రవారం పశ్చిమాసియా దద్దరిల్లింది. ప్రతీకార దాడలతో విరుచుకుపడ్డాయి. ఇరాన్‌పై ఇజ్రాయె ల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫహాసన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశా యి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారుఇరాన్‌లోని

వివరాలు2లో..

### భద్రాచలంలో కన్నులపండువగా

# సీతారాముల కల్యాణోత్సవం



హైదరాబాద్,: భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్స వం కనుల పండువగా జరుగుతుంది. భద్రాచలంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబసభ్యులతో కలిసి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క స్వామివారి కల్యాణం తిలకించారు. స్వామివారి కల్యాణోత్సవంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.తెలంగాణ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు: సీఎం రేవంత్ రెడ్డిపరమ పవిత్రమైన శ్రీరామ నవమి మహోత్సవం

వివరాలు2లో..

# చింతపండుకు చింతే...

గిరిజనుల శ్రమకు దక్కని ఆదాయం-కొనుగోళ్లకు దూరమైన జిసిసి
పెరిగిన దళారుల దోపిడీ




కురుపాం : ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన కుటుంబాల జీవనాడి అడవే. సీజన్ మొదలైతే చిన్నా, పెద్దా తేడా లేకుండా కుటుంబ సభ్యులంతా అడవుల్లోకి చేరి చింతపండు సేకరణలో నిమగమవుతారు. ముళ్లు గుచ్చుకుంటూ, ఎండలో కాలిపోతూ, రోజుల తరబడి పడే శ్రమ ఫలితమే ఆ చింతపండు. అదే వారి ఏడాది ఆదాయానికి ఆధారం. కానీ ఈసారి ఆ శ్రమకు సరైన ధర దక్కక గిరిజనుల్లో ఆవేదన ముదురుతోంది.అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించి, దళారుల దోపిడీ నుంచి గిరిజనులను కాపాడాలనే ఉద్దేశంతో ఏర్పాటైన జిసిసి ఈ సీజన్‌లో కొనుగోళ్లు చేపట్టకపోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది. గతంలో గ్రామాల వద్దే ఏర్పాటైన కొనుగోలు కేంద్రాలు ఈసారి కనిపించకపోవడంతో గిరిజనులు తమ సేకరణను నిల్వ ఉంచలేక దళారులకే అమ్మకాలు జరపాల్సి వస్తోంది. దీంతో దళారులు క్వింటాకు మార్కెట్ ధర కంటే వేల రూపాయలు తక్కువగా చింతపండును కొనుగోలు చేస్తున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకాల్లో మోసం, నాణ్యత పేరుతో కోతలు పెట్టడం వంటి చర్యలతో మరింత నష్టం జరుగుతోందని చెబుతున్నారు. అత్యవసరాల కోసం నగదు కావాల్సి ఉండడంతో వారు చెప్పిన ధరలకే సరుకును అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.సిండికేట్ దందా ఆరోపణలుప్రైవేటు వ్యాపారులు గ్రామాలకే చేరుకుని ముందస్తు నగదు ఇచ్చి, తర్వాత తక్కువ ధరకు సరుకు తీసుకెళు న్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది దళారులు సిండికేట్‌గా ఏర్పడి ఒకే ధర నిర్ణయించి కొనుగోళ్లు జరుపుతున్నారని గిరిజనులు అంటున్నారు. అనంతరం ఈ చింతపండును మైదాన ప్రాంతాలకు తరలించి భారీ లాభాలు ఆర్జిస్తున్నట్లు సమాచారం.జిసిసి నిర్లక్ష్యం పై విమర్శలుగిరిజనులకు అండగా నిలవాల్సిన జిసిసి వ్యవస్థ ఈసారి నిర్వీర్యంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోళ్లపై స్పష్టత లేకపోవడం, గ్రామస్థాయిలో అవగాహన కల్పించకపోవడం, కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడం వంటి కారణాలతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వ జోక్యం అత్యవసరం చింతపండు వంటి అటవీ ఉత్పత్తులే గిరిజనుల ఆర్థికాధారం. సరైన ధర లేకపోతే వారి కుటుంబాల జీవన విధానం దెబ్బతింటుంది. విద్య, వైద్యం, నిత్యావసరాల కోసం అప్పులపాలయ్యే పరిస్థితి తలెత్తుతోంది. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి కనీస మద్దతు ధర ప్రకటించి, జిసిసి ద్వారా గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకపోతే గిరిజనుల చెమటతో కూడిన చింతపండు దళారుల లాభాలకే పరిమితమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా గిరిజనుల జీవనాధారాన్ని కాపాడే చర్యలు తక్షణమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రామతీర్థం సీతారాముల కల్యాణానికి వైభవంగా బయలుదేరిన సింహాచల అప్పన్న పట్టువస్త్రాల ఊరేగింపు



సింహాచలం : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్ర అయోధ్యగా ప్రసిద్ధి గాంచిన రామతీర్థం క్షేత్రంలో వెలసిన శ్రీ సీతారామ స్వామి వారి కల్యాణోత్సవానికి సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం తరపున పట్టువస్త్రాలు మరియు ముత్యాల తలంబ్రాలను ఈరోజు అత్యంత వైభవంగా తీసుకెళ్లారు. ?శుక్రవారం ఉదయం సింహాచల దేవస్థాన కార్యనిర్వహణాధికారి జలేపల్లి వెంకటరావు దంపతులు, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను, పండ్లు మరియు పుష్పాలను బయలుదేరారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు మరియు సీతారామాచార్యులుఆలయ వేద పండితులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ?నాదస్వర వాయిద్యాలు, మంగళవాయిద్యాలు మరియు వేదమంత్రోచ్ఛారణల నడుమ భక్తిపారవశ్యంతో ఈ ఊరేగింపు సాగింది. ప్రతి ఏటా శ్రీరామనవమి నాడు సింహాచల అప్పన్న సన్నిధి నుండి రామతీర్థం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఒక పవిత్రమైన ఆనవాయితీగా వస్తోంది. ఆ సంప్రదాయాన్ని పాటిస్తూ, ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా కానుకలను తీసుకుని రామతీర్థం బయలుదేరారు.

# దద్దరిల్లిన పశ్చిమాసియా

మొదటి పేజి తరువాయి

ఇస్ఫహాసన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మృతుల సంఖ్య పెరుగుతోందిఇజ్రాయెల్ అమెరికా దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటి వరకు 1900 మందికి పైగా ప్రజలు మరణించారని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మరణించారు. 13 మంది అమెరికా సైనికులు కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో 1100 మందికి పైగా మరణించారి అక్కడి అధికారులు తెలిపారు.ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని.. దీర్ఘ, మధ్యశ్రేణి క్షిప ణుల దాడులు చేసినట్లు ఐఆర్‌జీసీ పేర్కొంది. ఈ దాడుల్లో బహ్రె యిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం నాశనమైనట్లు తెలిపింది. అయితే భారతీయులకు ఇరాన్ కృతజ్ఞతలు తెలిపింది. ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ.. టెహ్రాన్‌కు సంఘీభావం తెలిపిన దేశాలకు ఇరాన్ వినూత్నం గా కృతజ్ఞతలు చెప్పింది. క్షిపణిపై 'భారత ప్రజలకు కృతజ్ఞతలు' అనే సందేశాన్ని రాసి ఇజ్రాయెల్‌పై ప్రయోగించిందిస్పెయిన్, జర్మనీ, పాక్‌కు వంటి ఇతర దేశాలకు కూడా టెహ్రాన్ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ ట్వీట్ చేసిం ది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇజ్రాయెల్ మీద ఇరాన్ విరుచుకుపడింది. కీలకమైన హైఫా పోర్ట్‌పై డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడి చేసింది. నౌకాదళ మరమ్మతు కేంద్రా లు, లాజిస్టిక్స్ విభాగాలు, భారీ ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయిఇరాన్ డ్రోన్ సామర్థ్యం తగ్గిందన్న అమెరికా- వాదనలకు ఈ దాడి సమాధా నమని ఇరాన్ ప్రకటించింది మరోవైపు, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కారప్స్ (ఐఆర్‌జీసీ) గురువారం తెల్లవారుజామున ఇజ్రా యెల్, అమెరికా స్థావరాలపై 82వ విడత ప్రతీకార దాడులను ప్రారంభించింది. హైఫా పోర్ట్‌తోపాటు డెడ్ సీ సమీపం లోని ఇజ్రాయెల్ అణు కార్యక్రమాలకు సంబంధించిన పరిశ్రమలు, సైనికకమాండ్ సెంటర్లపై దాడులు జరిపినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్‌లో భూతల దాడికి ప్రయత్నిస్తే, అమెరికా- ఇజ్రాయెల్ దళాలకు నరకం చూపిస్తామని తీవ్రంగా హెచ్చరించింఇజ్రాయెల్ వైపు నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, హైఫా రిఫైనరీ కాంప్లె క్స్ వద్ద మంటలు చెలరేగాయి. విద్యుత్ సరఫరాకు స్వల్పఅంత రాయం కలిగినా, పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్లు ఇజ్రాయెల్ వర్గాలు తెలిపాయి. ఈ దాడుల వల్ల హైఫా పోర్ట్ కార్యకలాపాలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. అదానీగ్రూప్ నిర్వ హిస్తున్న ఈ పోర్ట్ వ్యూహాత్మకంగా ఇజ్రాయెల్‌కు ఎంతో కీలకంఇరాన్‌పైకి 850కి పైగా క్షిపణుఅమెరికా బలగాలు కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించి 28 రోజులు అవుతోంది. ఈ నాలుగు వారాల వ్యవధిలో అమెరికా 850కి పైగా తోమహాక్ క్షిపణులను ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఇలాం టి మరిన్ని క్షిపణులను వేసేందుకు చర్చలు జరిగాయని వాసింగ్టన్ పోస్టు పేర్కొందిఇరాన్‌పై దాడులు మరింత తీవ్రఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం చేస్తామని, వాటిని మరింత విస్తరిస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ తెలిపారు. ఈ యుద్ధ నేరానికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకుంటుందని కట్జ్ తెలిపారు. టెహ్రాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఆయుధాల స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పశ్చిమ ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై కూడా దాడులు చేసినట్లు వెల్లడించింది.గల్ఫ్‌కు ఇరాన్ మరో వార్నింంగల్ఫ్ దేశాలకు ఇరాన్ మరో వార్నింగ్ ఇచ్చింది. ఇప్పటికే అమెరికా నేవీ బేస్‌లను పలు గల్ఫ్ దేశాల్లో ఏర్పాటు చేసుకున్నందున ఆ దేశాలపై దాడులకు దిగిన ఇరాన్ మరో సారి వారిని హెచ్చరించింది. తమతో యుద్ధం చేస్తున్న వారికి గల్ఫ్ దేశాల్లోని హోటళ్లలో ఆశ్రయం ఇస్తున్నారని, అవి మూసుకోవాలని సూచించింది. ఒకవేల వారికి ఆశ్రయం ఇస్తే మాత్రం మరోసారి తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది.ఇరాన్ భూతలం లో కమ్ముకుంటున్న యుద్ధ బలగాలఅమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య గత 28 రోజులుగా జరుగుతన్న వైమానిక దాడులతో దద్దరిల్లుతున్నాయి. అయితే ట్రంప్ ఓవైపు ఇరాన్‌కు షరతులు విధిస్తూ.. డెడ్‌లైన్ పొడిగిస్తూ.. మరో వైపు అమెరికా సైన్యాన్ని ఇరాన్‌పై మోహరిస్తూ.. ఇక భూతల యుద్ధమే వ్యూహం రచిస్తు న్నారు. అందుకే ఇరాన్‌కు మరో 10 రోజుల గడువు ఇస్తూ.. ఏప్రిల్ 6 లోపు షరతులకు అంగీకరించాలని హెచ్చరించారు. మరోపక్క ఇరాన్‌పై భూతల దాడికి అమెరికా సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఖర్గ్ ద్వీపం టార్గెట్‌గా రెండు మెరైన్ గ్రూపులతోపాటు అదనంగా 7,000 మంది సైనికులు కూడా అగ్రరాజ్యం తరలిస్తోంది. ట్రంప్ పన్నాగాన్ని పసిగట్టి ఇరాన్ సిద్ధమవుతోంది. 10 లక్షల మంది సైన్యాన్ని ఏకం చేయడంతోపాటు ఐఆర్‌జీసీ, బసిజ్ ఫోర్స్ తదితర అనేక దళాలను బలోపేతం చేస్తోందియుద్ధంలోకి ఇరాన్ 12 ఏళ్ల పిల్లలు సైతం దించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇంకోవైపు ఇజ్రాయెల్ కూడా తమ బలగాలను సమీకరిస్తోంది.

# అయోధ్యలో అద్భుతం

: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయం లో శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన మూడో శ్రీరామ నవమి ఇది. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై 'సూర్య తిలకం చూసి భక్తులు పరవశించారు. ఈ పండగ వేళ... స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారుఅయోధ్య ఆలయంలో గర్భగుడిలోని బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు పడేందుకు మూడో అంతస్తులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరిమిత సంఖ్యలో పైపులు, కుంభాకార, పుటాకార కటకాలతో ఒక వ్యవస్థను రూపొందించారు. ఆలయ శిఖర భాగంలో సూర్యకాంతి గ్రహించేందుకు ఒక పరికరాన్ని ఏర్పాటుచేశారు. అక్కడినుంచి పైపు లోపలికి కాంతి ప్రసరించి తిలకం వలే కన్పిస్తోంది. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్(ఐఐఏ) శాస్త్రవేత్తలు, పరిశోధకుల సాయంతో కేంద్ర భవన నిర్మాణ పరిశోధన సంస్థ(సీబీఆర్ఐ) శాస్త్రవేత్తలు దీనిని నిర్మించారు.

ప్రతి శ్రీరామనవమి రోజున.ప్రతి శ్రీరామ నవమి రోజున బాలరాముడి నుదుటిపై ఈ తిలకం దిద్దేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం గడియారంలో ముల్లులు తిరిగేందుకు ఉపయోగించే పరిజ్ఞానం తరహాలో గేర్ టీత్ మెకానిజం వినియోగించారు. సూర్యకాంతిని గ్రహించే పరికరం వద్దే మరో పరికరం ఉంచారు. ఇది కాంతిని గ్రహించే అద్దాన్ని 365 రోజులు స్వల్పంగా కదుపుతూ ఉంటుంది. మళ్లీ శ్రీరామనవమి రోజు వారు అనుకున్న చోటుకు తీసుకొస్తుంది. అంతకుముందే ఏటా శ్రీరామనవమి వచ్చే కాలాన్ని అత్యంత కచ్చితత్వంతో గణించారు.

# నేడు 16 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

మొదటి పేజి తరువాయి

ఉందన్నారు. విజయనగరం 4, పార్వతీపురం మన్యం 7, పోలవరం 2, ఏలూరు 1, కృష్ణా 5, ఎన్‌టిఆర్ 9, గుంటూరు 16, బాపట్ల 1, పల్నాడు 21, ప్రకాశం జిల్లాల్లోని 2 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఆదివారం నాడు 18 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 29 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు.

# రాష్ట్రాల సన్నద్ధతపై సమీక్ష

మొదటి పేజి తరువాయి

ఇలాంటి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, యుపి, పంజాబ్, గుజరాత్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) అమల్లో వున్నందున ఎన్నికలు జరిగే రాష్ట్రాల సిఎంలు పాల్గొనలేదు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్‌షాలు కూడా పాల్గొన్నారు. కాగా ఎన్నికలు జరిగే ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత చీఫ్ సెక్రటరీలతో విడిగా కేబినెట్ సెక్రటరీ సమావేశం జరపనున్నారు.

మార్చి 25న కేంద్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించి పశ్చిమాసియాలో తలెత్తిన పరిస్థితులను వివరించింది. ఆ సమావేశానికి ప్రధాని గైర్హాజరైన విషయం పాఠకులకు తెలిసిందే. ఇంధన సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, సవివరమైన ప్రణాళికలను ఆ సమావేశంలో వివరించారు. ఈ ఇంధన సంక్షోభం సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశం వుందంటూ ఈ నెల 23న లోక్‌సభలో మాట్లాడుతూ ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో అందరం కలిసి ఎలా ఎదుర్కొన్నామో ఇప్పుడు కూడా దేశం అందుకు సన్నద్ధంగా వుండాలని కోరారు

# జలచరాలకు ప్రమాద ఘంటిక ..!

మొదటి పేజి తరువాయి

మెక్సికో అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఏడు ప్రకృతి సంరక్షణ ప్రాంతాలతో సహా సముద్రంలోని జీవరాశులపై పెను ప్రభావం పడిందన్నారు. రెండు సహజ చమురు ఊటలు, ఓ చమురు నౌక సముద్రంలో బోల్తాపడడం వల్ల ఈ ముప్పు సంభవించిందన్నారు. కొన్ని నెలల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా మెక్సికోలోని వెరాక్రూజ్ ప్రాంతంలో సహజంగా చమురు బయటకు వచ్చే పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో లీకైన చమురు నదుల ద్వారా సముద్రంలోకి చేరి, సుమారు 200 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని దాటి మొత్తం 600 కిలోమీటర్ల వరకు వ్యాపించింది. అదనంగా, కాంపెచే బేలోని మరో సహజ చమురు ఊట కూడా నిరంతరం లీక్ అవుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతోంది. అలాగే మూడు నెలల క్రితం సముద్రంలో ఒక చమురు నౌక మునిగిపోవడం వల్ల పరిస్థితి మరింత విషమించింది. ఈ ఘటనల వల్ల సముద్రంలోని వందలాది చేపలు, సముద్ర తాబేళ్లు వంటి జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే, ప్రకృతి సంరక్షణ ప్రాంతాలు, బయోస్పియర్ రిజర్వులు, జాతీయ పార్కులు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రస్తుతం కాలుష్యాన్ని నియంత్రించేందుకు అధికార సిబ్బంది శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నారు.

# ఏప్రిల్ 25న కవిత కొత్త పార్టీ ప్రకటన

హైదరాబాద్: అనేక ఆలోచనలకు నిజామాబాద్ కేంద్రమైందని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లయినా.. ప్రధాన ఆశయాలు నెరవేరలేదని ఆరోపించారు. నీళ్లు, నియామకాలు, నిధులు వంటి ఆశయాలు నెరవేరలేదన్నారు. అందరికోసం పనిచేసేలా నూతన పార్టీ ఉండాలన్నారు. ప్రజల కోసం కొత్త పార్టీ కావాలన్నారు. మక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తి కావాలని బలంగా విశ్వసిస్తున్నామని చెప్పారు.తెలంగాణ సర్వోదయం కోసం నూతన పార్టీ రావాలని ఆకాంక్షించారు. తెలంగాణ జాగృతి ద్వారా అనేక పోరాటాలు చేశామని గుర్తుచేశారు. నూతన రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపిస్తున్నట్లు కవిత ప్రకటించారు. మేడ్చల్ మునీరాబాద్ లోని అధ్వయ కన్వెన్షన్ లో ఏప్రిల్ 25న కొత్త పార్టీ ప్రకటిస్తామని నిజామాబాద్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత వెల్లడించారు. ఏప్రిల్ 25న పార్టీ పేరు.. జెండాను ప్రకటిస్తామని తెలిపారు. యువత, మహిళలకు తన పార్టీలో మంచి స్థానం ఉంటుందని కవిత పేర్కొన్నారు. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారన్న కవిత తెలంగాణ ఆడబిడ్డగా తాను పెట్టే పార్టీ ఎలా ఉంటుందో మీరే చూస్తారని కవిత చెప్పారు.

# ప్రధాని నిర్ణయం దేశ ప్రజలకు ఊరట

మొదటి పేజి తరువాయి

అభినందనీయని పేర్కొన్నారు. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించడంతోపాటు డీజిల్‌పై ఉన్న సుంకాన్ని పూర్తిగా రద్దు చేసినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం దేశ ప్రజలతోపాటు చమురు సంస్థలకు కూడా ఊరటనిస్తుందన్నారు.

### అమరావతిపై
# మీ విధానమేంటి జే..టర్న్ జగన్?

మొదటి పేజి తరువాయి

చదువుకున్న వ్యక్తి హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలో ఉండటానికి ఇష్టపడతాడు. అంతేకానీ తిరుపతిలో ఉండటానికి ఇష్టపడడు. అందుకే మహానగరం నిర్మించాలి" అని వివిధ సందర్భాల్లో జగన్ చేసిన వ్యాఖ్యలున్నాయి. వీటితో పాటు వైకాపా ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో జగన్ చేసిన మూడు రాజధానుల ప్రకటనా ఉంది.

# భద్రాచలంలో కన్నులపండువగా సీతారాముల కల్యాణోత్సవం

మొదటి పేజి తరువాయి

సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మం, న్యాయం, నిజాయితీకి ప్రతీకగా నిలిచిన శ్రీరామచంద్ర ప్రభువు ప్రజలందరికీ ఆదర్శ పురుషుడని పేర్కొన్నారు. ఆ ధర్మస్వరూపుడు చూపిన మార్గంలో నడుస్తూ, మన జీవితాల్లో సత్యం, సహనం, కర్తవ్యబద్ధతను అలవర్చుకుని ఆదర్శ జీవితం గడపాలని కోరారు. శ్రీరామచంద్రుని కృపాకటాక్షాలతో ఈ పవిత్రమైన శ్రీరామనవమి మహోత్సవంఅందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

### అల్లూరి జిల్లాలో కూలిన డ్రోన్..
# గిరిజన ప్రాంతాల్లో కలకలం !




పాడేరు డెక్కన్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.మాడుగుల మండలం బొయితిలీ (బొయితిలి) అటవీ ప్రాంతంలో శుక్రవారం ఒక భారీ డ్రోన్ నేలకూలింది. ఈ ఘటన స్థానిక గిరిజనుల్లో తీవ్ర ఆందోళన, కలకలం సృష్టించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు, ఫోటోలు ఈ వార్తను మరింత హల్‌చల్ చేశాయి. రెడ్ వింగ్ అనే సంస్థకు చెందిన ఈ డ్రోన్ ట్రయల్ రన్‌లో భాగంగా అదుపు తప్పి చెట్లపై పడి కూలిపోయింది. ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు, మందులు, రక్త యూనిట్లు, నమూనాలు సరఫరా చేయడం కోసం ఈ డ్రోన్‌లను ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. సాంకేతిక లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. డ్రోన్ జనావాసాలపై పడకపోవడం అదృష్టం. ఎటువంటి ప్రాణ నష్టం లేదు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం, జి.మాడుగుల మండలం, గిమ్మరాజుపాడు పంచాయతీ పరిధిలోని బొయితిలీ గ్రామం సమీప అడవి ప్రాంతంలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖతో రెడ్ వింగ్ సంస్థ భాగస్వామ్యంతో పాడేరు కేంద్రంగా డ్రోన్ ద్వారా మెడికల్ సర్వీసెస్ ప్రాజెక్టు నడుస్తోంది.

# కన్నుల పండుగగా సీతారాముల కల్యాణోత్సవం

**వసంత నవరాత్రి మహోత్సవాలలో అనుదినం సతీసమేతంగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ రాజుగారు.**

**సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీనుల విందుగా వీక్షించిన వందలాదిమంది భక్తజనులు.**





ప్రజాస్వామ్యం /గజపతినగరం:

గజపతినగరం దిగువ వీధిలో ఉన్న దేవాలయాల సముదాయంలో గల శ్రీ సీతారామ స్వామి వారి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం వెంకట రాఘవాచార్యులు గారి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వసంత నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. అభిజిత్ లగ్నంలో జరిగిన సీతారాముల కళ్యాణం లో ఉప్పలపాటి రమేష్ రాజు - రమాదేవి దంపతులు ,, వడలి నాగ వెంకట



మహాదేవ శ్రీనివాస్ - బాలా త్రిపుర సుందరి దంపతులు పాల్గొన్నారు. వసంత నవరాత్రి మహోత్సవాలలో అనుదినం ఉప్పలపాటి రమేష్ రాజు గారు సతీసమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొనడం విశిష్టతను సంతరించుకుంది. తెలుగు సంవత్సరాది ఉగాది రోజున వసంత నవరాత్రి మహోత్సవాలకు అగ్ని ప్రతిష్టతో అంకురార్పణ జరిగింది. శుక్రవారం ఉదయం లక్ష్మీ అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, సాయంత్రం విష్ణు సహస్ర నామ పారాయణం లక్ష్మీ హవనం జరిగాయి. శనివారం నాడు సీతారామస్వామి సహస్ర నామ అర్చన, విష్ణు సహస్రనామ పారాయణం ,,రామ గాయత్రీ హోమం , ఆదివారం నాడు సూర్య నమస్కారములు, విష్ణు సహస్రనామ పారాయణం నిత్య హోమాలు ,సోమవారం నాడు సుదర్శన హోమం విష్ణు సహస్రనామ పారాయణం, మంగళవారం నాడు దాశ ఆంజనేయ స్వామి వారి సహస్ర సింధూర అర్చన, నాగవల్లీ దళార్చన ,నిత్య హోమాలు జరిగాయి. బుధవారం నాడు అష్టోత్తర శత కలశాభిషేకం, రామ గాయత్రీ హోమం, లక్ష్మివారం నాడు నిత్య అర్చన ,సరస్వతీ దేవత హోమం, శ్రీరామనవమి నాడు ఉదయం 8 గంటలకు మహా పూర్ణాహుతి ,9 గంటలకు సీతారామస్వామి సారి సమర్పణ, 10 గంటలకు సీతారామస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభించబడ్డాయి . శ్రీనివాస ఆచార్యులు కల్యాణ విశిష్టతను వివరిస్తూ ,సీతారాముల కళ్యాణ కార్యక్రమం జరిపించారు . సీతారాముల కళ్యాణ ఉత్సవంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు పాల్గొని కన్నుల పండుగగా కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం వేద పండితులు కల్యాణాక్షతలతో భక్తులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు . కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు అన్న సమారాధన ఏర్పాటు చేశారు . అదేవిధంగా నియోజకవర్గంలో గల అన్ని గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితులు ముద్దు శర్మ, మురళీ ప్రసాద శర్మ, కందాల కృష్ణ మురారి, కందాల రమా విహారి, ఆలయ కార్య నిర్వహణ అధికారి కరి శ్రీరామ్ హోమాలు ,రామాయణ పారాయణం భక్తిశ్రద్ధలతో జరిపించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, భక్తజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం



పర్వతగిరి ప్రజాస్వామ్యం మార్చి 27:పర్వతగిరి మండలం ఏబి తండా గ్రామ పంచాయతీలో స్థానిక శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. వేద మంత్రాల నడుమ కళ్యాణం జరగగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీ తండా గ్రామ సర్పంచ్ గుగులోత్ కిషన్ నాయక్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ నాయక్, భూక్యా మోహన్, భూక్యా రాములు,భూక్య వీరన్న, భూక్యా బాలు,అనిల్, శ్రీను, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ క్షేత్రంలో సీతారాములకు పంచామృతభిషేకాలు



ప్రజాస్వామ్యం, విజయనగరం

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పంచామృత అభిషేకాలు గావించారు. సాధకులు అంతర్ముఖులై, ఏ ఆనందం కోసం అన్వేషిస్తున్నారో, తమ మనోమందిరాల్లో ఏ ఆకృతిని ప్రతిష్ఠితంచేసుకుని ఆరాధిస్తున్నారో ఆ దివ్యపథానికి సాకారం- శ్రీరాముడు.మనుషుల్లోని రా అంటే 'రాక్షస గుణాలను మ అంటే 'మ'ర్దించే పరమ దైవం- రాముడు.శివకేశవ చైతన్యాన్ని తనలో సమ్మిళితంచేసుకున్న బీజాక్షర సంపుటి శ్రీ రామ నామం. ర, అ, మ అనే మంత్రాక్షరాల మేలు కలయిక అయిన రామ శబ్దాన్ని సృష్టి, స్థితి, లయ కార్యకారణత్వాలకు ప్రతిఫలంగా భావిస్తారు.శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సీతారాములకు విశేష పంచామృత అభిషేకాలు గావించారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు ,రమణమూర్తి, శ్రీదేవి దంపతులు పాల్గొన్నారు

## రామ నారాయణంలో సీతారాములకు పంచామృతాభిషేకాలు



ప్రజాస్వామ్యం ,విజయనగరం ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణ శ్రీమద్రామాయణ ప్రాంగణంలో శ్రీరామనవమి పర్వతనాన్ని పురస్కరించుకుని సీతారాములకు పంచామృత అభిషేకాలు గావించారు .శ్రీరామ నామం రక్షణ కవచం శ్రీరామ మంత్రం అభయ హస్తం శ్రీరామచంద్రుడి సద్గుణాలు సదా ఆచరణీయం శ్రీరాముడి వ్యక్తిత్వం ప్రతీ వ్యక్తికి ఆదర్శనీయం రామాయణం భారతీయ సంస్కృతీ, సనాతన ధర్మ ప్రతిరూపం, దీని మౌలికతత్వాలు, ధర్మ, జ్ఞానాలను శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. నేడు ఆ జగదభిరాముడు ఇలపై పుట్టిన రోజు..ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతారాములకు వేదమంత్రాల నడుమ దేవాలయం అర్చకులు పంచామృత అభిషేకాలు గావించారు .

### రేపు కళా సాహితి ఆధ్వర్యంలో
## పౌరాణిక కళాకారుల ప్రదర్శనలు



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం కళా సాహితి (భీమునిపట్నం) ఆధ్వర్యంలో ఆదివారం పౌరాణిక కళాకారుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కళా సాహితి అధ్యక్షులు పి. ఆర్. పి. వర్మ తెలియచేసారు. స్థానిక శ్రీ వాసవి కల్యాణ మండపం నందు ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.00 వరకు ఈ ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. శ్రీ రామాంజనేయ యుద్ధం, గాయోపాఖ్యానం యుద్ధం, శ్రీ సత్య హరిశచంద్ర అమ్మకం సీను అను పౌరాణిక నాటక ఘట్టాలను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రామకృష్ణానంద, అతిథులుగా డా. ఫణి కుమార్, ఆర్. అప్పల నరసయ్య, డా. ఎన్. ఎల్. రావు, బి. చెన్నయ్య శెట్టి, కంటుభుక్త రామా నాయుడు పాల్గొంటారని తెలియచేసారు. ఔత్సాహికులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**-బ్రిలియంట్ కంపెనీ ఎం డి ధీరజ్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ వెంకట రామారావు,**

హైదరాబాద్ ప్రజాస్వామ్యం మార్చి 27: సీతారాముల కళ్యాణం సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన, కమనీయమైన ఆధ్యాత్మిక వేడుకని బ్రిలియంట్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ వెంకట రామారావు అన్నారు.. శుక్రవారం వారి కార్యాలయంలో, ఏర్పాటు చేసిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా వెంకట రామారావు మాట్లాడుతూ,





సీతారాముల కళ్యాణం కేవలం ఇద్దరు వ్యక్తుల పెళ్లి కాదని,లోక కళ్యాణార్థం జరిగే ఒక దివ్య లీలని, సుఖదుఃఖాలలో, అడవిలోనైనా, రాజభవనంలోనైనా కలిసుండే ఆదర్శవంతమైన బంధం వీరిదని సీతారాముల కళ్యాణం కళ్లారా చూడటం కన్నుల పండుగని ఆయన అన్నారు. అనంతరం ప్రధాన రహదారిపై, జై శ్రీరాం అంటూ భారీ ర్యాలీ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, నరేందర్, మేనేజర్ రాకేష్ గౌడ్ ,ఇస్మాయిల్, గోపి, దీరన్, సునీత, సాయికిరణ్, ప్రసాద్, అశ్విని, అరుణ, సుమంత్, కిషోర్, గౌరి,సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు.. అన్నదానానికి ఆర్థిక సాయం

(ప్రజాస్వామ్యం) విజయనగరం, హుకుంపేట:శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక హుకుంపేటలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'చిన్న శ్రీను సోల్జర్స్' ఉపాధ్యక్షుడు తోట వాసు ఆలయ కమిటీకి అన్నదాన కార్యక్రమం నిమిత్తం 5 వేల రూపాయల విరాళాన్ని అందజేశారు.కుటుంబ సభ్యుల పేరున పూజలు: తోట వాసు తన అన్నయ్య, ప్రముఖ నాయకులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), వదిన మజ్జి పుష్పాంజలి, వారి కుమార్తె (చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు) సిరమ్మ, మరియు అల్లుడు (నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు) ప్రదీప్ నాయుడు గారి పేరు మీద స్వామివారికి ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. వారి కుటుంబం



సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, లోకకళ్యాణం జరగాలని కోరుతూ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డుపై బండి ఆపితే.. చలానా తప్పదు

**ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు హెచ్చరిక**




తగరపువలస, ప్రజాస్వామ్యం ట్రాఫిక్ నిబంధనల విషయంలో ఏమాత్రం అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ బి. తిరుపతిరావు స్పష్టం చేశారు. దుకాణదారులకూ హెచ్చరికలు జారీ చేసారు. వ్యాపారులు నిబందనలు పాటించాలని, తగరపువలస లో 'నో పార్కింగ్' బోర్డు లు ఏర్పాటు చేసారు. తగరపువలస జంక్షన్‌లో వాహనాల రద్దీ, పార్కింగ్ సమస్యలపై ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే వాహనాలను సీజ్ చేస్తాం అన్నారు. షాపుల ముందు కస్టమర్లు వాహనాలు నిలపకుండా యజమానులే చూసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే వాహనదారుడితో పాటు దుకాణదారుడిపై కూడా ఫైన్ వేస్తాం అన్నారు.

## కనులపండువగా సీతారాముల కళ్యాణం

**పట్టువస్త్రాలను సమర్పించిన మంత్రి - కొండపల్లి శ్రీనివాస్**

ప్రజాస్వామ్యం / ?రామతీర్థం,(విజయనగరం):

విజయనగరం జిల్లాలోని చారిత్రాత్మక పుణ్యక్షేత్రం రామతీర్థం నీలాచల కొండవద్ద వెలసిన సీతారామచంద్ర స్వామివారి సన్నిధిలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. 'ఉత్తర అయోధ్య'గా పేరుగాంచిన ఈ క్షేత్రంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ



మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరై, స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య, వేద పండితుల మంత్రోచ్చారణలతో అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. శ్రీరామనవమి పర్వదినం సమాజానికి ధర్మం, న్యాయం, సత్యం వంటి విలువలను గుర్తు చేస్తుందని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం మరియు కల్యాణ వీక్షణ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారుఈ ఆధ్యాత్మిక వేడుకలో నెల్లిమర్ల శాసనసభ్యురాలు లోకం నాగమాధవి దంపతులు, ఎమ్మెల్సీలు గాదే శ్రీనివాసులు నాయుడు, పెనుమత్స సూర్యనారాయణ రాజు, సింహాచలం దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావు, ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ దంపతులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కుటుంబ సమేతంగా శ్రీరాముని కళ్యాణానికి విచ్చేసి పట్టు వస్త్రాలు



సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం, పోలీస్ యంత్రాంగం తాగునీరు, ప్రసాదం, వైద్య సదుపాయాలు మరియు భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.





# పెద్ది.. మరోసారి తారక్ కనెక్షన్స్

ఈ గ్లింప్స్ లో చరణ్ ఒక పక్కా కుస్తీ యోధుడిలా, ఆ బాడీ లాంగ్వేజ్ తో కనిపిస్తుంటే అందరికీ తారక్ కు చెప్పిన పాత కథే గుర్తొస్తోంది.రామ్ చరణ్ 'పెద్ది' సినిమా అప్‌డేట్స్ వస్తున్న కొద్దీ ఒక పాత వార్త మళ్ళీ నెట్టింట హల్చల్ చేస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమా కంటే ముందు దాదాపు రెండేళ్ల పాటు జూనియర్ ఎన్టీఆర్ చుట్టూ తిరిగిన విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో తారక్ కోసం ఆయన ఒక కుస్తీ నేపథ్యంలో సాగే కథను సిద్ధం చేశారని ఇండస్ట్రీలో గట్టిగా వినిపించింది. అయితే కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కకపోవడంతో, అదే కథను ఇప్పుడు చరణ్ తో తీస్తున్నారా అనే అనుమానం చాలా మందిలో కలుగుతోంనిజానికి ఎన్టీఆర్ కోసం బుచ్చిబాబు అనుకున్న కథలో హీరో ఒక యాక్సిడెంట్ లో కాళ్లు కోల్పోతాడని, ఆ తర్వాత కుస్తీ టీమ్‌కు కోచ్‌గా మారి తన కల నెరవేర్చుకుంటాడని అప్పట్లో ప్రచారం జరిగింది. చరణ్ తో సినిమా అనౌన్స్ చేసినప్పుడు మాత్రం బుచ్చిబాబు ఒక మాట చెప్పారు. తారక్ కు చెప్పిన కథ వేరని, చరణ్ కోసం రాసుకున్నది అసలు సంబంధం లేని కొత్త సబ్జెక్టు అని క్లారిటీ ఇచ్చారు. కానీ విడుదలైన 'పహిల్వాన్' గ్లింప్స్ చూశాక సోషల్ మీడియాలో సీన్ మొత్తం మారిపోయింఈ గ్లింప్స్ లో చరణ్ ఒక పక్కా కుస్తీ యోధుడిలా, ఆ బాడీ లాంగ్వేజ్ తో కనిపిస్తుంటే అందరికీ తారక్ కు చెప్పిన పాత కథే గుర్తొస్తోంది. అప్పట్లో కుస్తీ కోచ్ గా ఎన్టీఆర్ ను ఊహించుకున్న వాళ్లంతా, ఇప్పుడు చరణ్ ను అదే గెటప్ లో చూసి ఇది కచ్చితంగా ఆ పాత స్క్రిప్టే అని ఫిక్స్ అయిపోతున్నారు. ఒకవేళ అదే కథ అయితే, అప్పుడు అనుకున్న కుస్తీ పాయింట్ కు ఇప్పుడు క్రికెట్ ఎలిమెంట్స్ ను కూడా జోడించి బుచ్చిబాబు ఏదో కొత్త మ్యాజిక్ చేస్తున్నట్లు అనిపిస్తోంఒక స్టార్ హీరో కోసం రెండేళ్లు కష్టపడి రాసుకున్న కథను వదులుకోలేక, దానికే కొన్ని మార్పులు చేసి చరణ్ ఇమేజ్ కు తగ్గట్టుగా సెట్ చేశారనేది ఇప్పుడు వినిపిస్తున్న మాట. గ్లోబల్ స్టార్ గా ఎదిగిన చరణ్ కు ఇలాంటి ఒక ఇంటెన్స్ ఎమోషనల్ రోల్ పడితే ఆయన కెరీర్ కు అది పెద్ద ప్లస్ అవుతుంది. కానీ బుచ్చిబాబు మాత్రం మొదటి నుంచీ ఇవి రెండు వేర్వేరు కథలని చెబుతూనే వస్తున్నారు. ఈ కన్ఫ్యూజన్ మీద దర్శకుడు మళ్ళీ ఏమైనా స్పందిస్తాడేమో చూడాలిఏప్రిల్ 30న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది.



## బాలీవుడ్ ఎంట్రీతో శ్రీలీలకి బ్రేక్ దొరుకుతుందా?

టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో ఒక గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. 'పెళ్ళి సందడి', 'ధమాకా' వంటి సినిమాలతో టాలీవుడ్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న ఈ భామకు, ఇటీవల వరుస పరాజయాలు పెద్ద దెబ్బ తీశాయి. తాజాగా విడుదలైన 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడంతో శ్రీలీల ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఒకప్పుడు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా వెలిగిన ఈమె చేతిలో ప్రస్తుతం ఒక్క క్రేజీ తెలుగు ప్రాజెక్ట్ కూడా లేకపోవడం గమనార్హం. అందుకే ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ తన దృష్టిని బాలీవుడ్ వైపు మళ్ళించింది. ఆ వివరాలు చూద్దాం ..టాలీవుడ్‌లో వరుస షాక్‌లు:శ్రీలీల కెరీర్ ఒకప్పుడు రాకెట్ లా దూసుకుపోతుందనుకున్నారు అందరూ. ఆమె డ్యాన్స్, ఎనర్జీకి ఫిదా అయిన స్టార్ హీరోలందరూ తమ సినిమాల్లో ఆమెనే హీరోయిన్‌గా తీసుకోవాలని పోటీ పడ్డారు. కానీ, కథల ఎంపికలో జరిగిన పొరపాట్లు ఆమెను ఇబ్బందుల్లోకి నెట్టాయి. 'ఆదికేశవ', 'స్కంద', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి సినిమాలు వరుసగా ఫ్లాప్ అవ్వడం శ్రీలీల మార్కెట్‌ను దెబ్బతీసింది. తాజాగా వచ్చిన పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా ఫెయిల్ అవ్వడంతో టాలీవుడ్ మేకర్స్ ఈమె వైపు చూడటానికి కాస్త ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.హిందీ సినిమాలపైనే భారీ ఆశలు:తెలుగులో అవకాశాలు తగ్గుతున్న క్రమంలో శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తీక్ ఆర్యన్ సరసన ఒక భారీ ప్రాజెక్ట్‌లో నటించే అవకాశం దక్కించుకుంది. హిందీ మార్కెట్ లో ఈ సినిమా కనుక క్లిక్ అయితే, శ్రీలీల రేంజ్ మళ్ళీ మారిపోవడం ఖాయం. గ్లామర్ పరంగా, డ్యాన్స్ పరంగా బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడం శ్రీలీలకు పెద్ద కష్టమేమీ కాదు. ఇక మరి ఈ బాలీవుడ్ బ్రేక్ ఆమె కెరీర్‌ను మళ్ళీ ట్రాక్ లోకి ఎక్కిస్తుందో లేదో వేచి చూడాలిధనుష్ సినిమాతో కోలీవుడ్ ఎంట్రీశ్రీలీల కేవలం బాలీవుడ్ మాత్రమే కాదు, కోలీవుడ్ మీద కూడా కన్నేసింది. వెర్సటైల్ యాక్టర్ ధనుష్‌తో కలిసి ఒక సినిమాలో నటిస్తున్నట్లు సమాచారం. ధనుష్ వంటి స్టార్ హీరో పక్కన ఛాన్స్ రావడం శ్రీలీలకు దొరికిన గోల్డెన్ ఆఫర్ అని చెప్పాలి. తమిళ్ మార్కెట్ లో కూడా తన సత్తా చాటితే, సౌత్ ఇండియా మొత్తం మళ్ళీ ఈమె జపం చేయడం ఖాయం. ఇక ప్రస్తుతం తన ఫోకస్ మొత్తం టాలీవుడ్ బయటే పెట్టిన ఈ భామ, ఇతర భాషల్లో సక్సెస్ సాధించి మళ్ళీ తెలుగులో గ్రాండ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని ప్లాన్ చేస్తోందికమ్‌బ్యాక్ కోసం పోరాటంసినిమా ఇండస్ట్రీలో హిట్లు, ఫ్లాపులు సహజం. ఒకప్పుడు టాప్ లో ఉన్న హీరోయిన్లు కూడా ఇలాంటి కష్టకాలాన్ని చూసినవారే. శ్రీలీలకు ఉన్న టాలెంట్, డ్యాన్సింగ్ స్కిల్స్ మరే హీరోయిన్‌కు లేవనే చెప్పాలి. కేవలం ఒక సాలిడ్ హిట్ పడితే చాలు, మళ్ళీ శ్రీలీల డేట్స్ కోసం నిర్మాతలు క్యూ కడతారు.



## దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం .టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898 ఏడీ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది.ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది.ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోందిసోషల్ మీడియాలో గ్లామర్ విందు:దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారుబ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోందిమొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!

## కరుప్పుపై భారీ హైప్.. టెన్షన్ లో ఫ్యాన్స్

సూర్య నటించిన కరుప్పు సినిమా రిలీజ్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఇది సూర్య కెరీర్‌లో ఒక కీలక మలుపుగా మారుతుందా అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఎక్కువగా వినిపిస్తోంది. గత కొన్ని సినిమాలుగా ఆయన చేసిన ప్రయోగాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, ఫ్యాన్స్ కోరుకునే సూర్య మాత్రం కనిపించలేదనే భావన ఉంది. ఈ నేపథ్యంలో కరుప్పు ఆ లోటును తీర్చగలదా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారింది.హీరో పాత్రల్లో సహజత్వం తగ్గుతుందిడైరెక్టర్ ఆర్జే బాలాజీ ఈ సినిమాను కేవలం కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే కాకుండా, ఒక స్పష్టమైన సోషల్ మెసేజ్ తో తెరకెక్కించినట్లు చెప్పడం ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో హీరోలను ఎక్కువగా రౌడీలు లేదా పోలీసులుగా చూపించే ట్రెండ్ పెరిగిందని, దీంతో పాత్రల్లో సహజత్వం, వైవిధ్యం తగ్గిపోయిందని బాలాజీ అభిప్రాయపడుతున్నారు. కరుప్పు ద్వారా సాధారణ మనుషుల కథలను, రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలను తెరపైకి తీసుకురావడానికి బాలాజీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోందిఎక్కువ హైప్ కూడా రిస్కేఅయితే, సినిమా ప్రమోషన్స్ మాత్రం మరింత పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. ఈ సినిమా రిలీజ్ కు ముందే భారీ స్థాయిలో హైప్ క్రియేట్ అవుతోంది. ఇంటర్వ్యూలు, ఈవెంట్లు, స్టేట్మెంట్స్ ఇవన్నీ కరుప్పు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. కానీ ఇదే అంశం ఇప్పుడు రిస్క్‌గా మారే అవకాశం కూడా ఉంది. అంచనాలు ఎక్కువైపోయి, తర్వాత సినిమాలోని కంటెంట్ వాటిని అందుకోలేకపోతే నెగటివ్ టాక్ వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే కొందరు విశ్లేషకులు ప్రమోషన్స్‌లో కొంత నియంత్రణ అవసరమని సూచిస్తున్నారుగత సినిమాల కంటే 15 రెట్లు బడ్జెట్ ఎక్కువఇక బడ్జెట్ పరంగా చూస్తే, కరుప్పు ఓ భారీ ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. తన గత సినిమాతో పోలిస్తే దాదాపు 15 రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టారని ఆర్జే బాలాజీ వెల్లడించారు. ఇది సినిమా స్కేల్, ప్రొడక్షన్ వాల్యూస్ ఎంత పెద్దగా ఉన్నాయో చూపిస్తోంది. అయితే అదే సమయంలో ఇది ఒక పెద్ద రిస్క్ కూడా. భారీ పెట్టుబడిని రికవర్ చేయాలంటే సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవాల్సి ఉంటుంది.మే 14న కరుప్పు రిలీఫ్యాన్స్ పరంగా చూస్తే, కరుప్పుపై ఎక్స్‌పెక్టేషన్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో సూర్యకు మళ్లీ పాత ఇమేజ్ వస్తుందని, ఈ సినిమా ఆయనకు స్ట్రాంగ్ కంబ్యాక్ అవుతుందని భావిస్తున్నారు. చాలా కాలంగా మిస్సైన సూర్యను తిరిగి చూడాలనే కోరిక అభిమానుల్లో ఉంది. ఆ ఎమోషన్ ఈ సినిమాకు పెద్ద ప్లస్‌గా మారే అవకాశం ఉంది. మరి మే 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.



EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022